“ఏ మాటా” అడిగారు పాండురంగారావుగారు.

“అదే సర్.... మీరు చెప్పిన మాటే.... రాగానే అతిథుల్ని ఏ సెక్షన్ ప్రకారం మర్యాద చేయాలో ఆ కోడాఫ్ కాండక్ట్స్ మీద నచ్చచెబుతున్నాను. అప్పటికీ నిలబెట్టి మాట్లాడుతూంది తప్ప మాట నిలబెట్టుకోవడంలేదు.”

“సిగ్గు లేకపోతేసరి” పంటి బిగువున కోపాన్ని అదిమిపెడుతూ అంది హరిత యశస్విని చూస్తూ.

“డాడీ” తండ్రిని సమీపించి “అదేంటో పాపం యశస్వి ఇందాకట్నుంచి మీ గురించి, షుగర్ ఫేక్టరీ గురించి తెగ వరీడ్‌గా మాట్లాడుతుంటే ఆ విషయాలు నాకు తెలీదూ మా డాడీ వచ్చాక ఆయన వివరంగా చెబుతారని నచ్చ చెబుతున్నాను. ఇంతలో
మీరెలాగూ వచ్చారు కాబట్టి ఇక నాకు ప్రాబ్లం తప్పింది” అంది.

యశస్వి తల పట్టుకున్నాడు.

పాండురంగారావు భడేలున నవ్వేసి “ఆ విషయాలు అమ్మాయికేం తెలుస్తాయి యశస్వి.... అసలు యీ చెరుకు ధర వుంది చూశావూ....”
ఆయనకి ఓ అద్భుతమైన అవకాశం చిక్కినట్టు ఉపన్యాసం మొదలు పెట్టాడు.

దొరికిపోయాననుకుంటూ సోఫాలో చతికిలబడిన యశస్వికి మరో అయిదు నిమిషాలలో కాఫీ తీసుకొచ్చిన హరిత “గుడ్ నైట్” అంది రహస్యంగా.

** ** ** **

సాయంకాలం అయిదు గంటలు దాటి ఇరవై నిముషాలు గడిచాయి.

ఆకాశం మేఘావృతమైంది.

ఆగివున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాల్సిన ప్రయాణీకులు ముసురుతున్న ఈగల్లా, బోగీల్లోకి చొచ్చుకువచ్చే గాలి దుమ్ము రేపుతూ స్టేషన్ సమీపంలోని తటాకాలపై తన ప్రతాపాన్ని చూపుతుంటే....

చీకటి గుండెలో బ్రతకాలనే ఆశాదివ్వెని వెలిగించుకున్న నానీ భయంతో పరుగెత్తుకొస్తున్నాడు.

అప్పటికే ప్లాట్‌ఫాంపై అడుగు పెట్టిన రాజారావు పొదల మధ్య పరుగెత్తే కళింగనాగులా జనాల్ని తోసుకుంటూ నానీ కోసం గాలిస్తున్నాడు.

రేపటి కోర్టులో నానీ నిజం చెప్పకూడదని ఈ రోజు ఏటిలో నెట్టేదామనుకుంటే నేర్గా తప్పించుకున్నాడు నానీ.

మామిడి తోపుల్లో నుంచి ఒత్తు మర్రిచెట్ల మధ్యగా అనుసరిస్తూ వచ్చాడు.

కాదు.... చేతికి చిక్కితే పీక పిసికి శారదానదిలో పారేద్దామనే దృఢ సంకల్పంతో వున్నాడు.

ఎక్స్‌ప్రెస్ కూత పెట్టింది.

ఉస్సురోమంటున్న రాజారావు బండి కదులుతుండగా చూశాడు నానీని.

రాజారావుని చూసి భయంతో వణికిపోయిన నానీ అప్పటికే ఓ కంపార్టుమెంటులోకి జొరబడిపోయాడు.

రాజారావు ఆలస్యం చేయలేదు.

తనూ అదే బోగినెక్కేశాడు.

రాజమండ్రిని చేరేది మరో మూడుగంటల్లో....

ఆ మాత్రం వ్యవధి చాలు నానీని చేజిక్కించుకోవడానికి, చీకటి గోదావరిలోకి విసిరిపారేయటానికీ....

దురదృష్టవశాత్తూ నానీ కంగారులో ఎక్కింది ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటు.

ప్రయాణీకులంతా కూర్చునేది కుర్చీల్లో కాబట్టి ఇప్పుడు నానీ బిక్కమొహం వేసుకుని దాక్కోడానికి చోటు లేనట్టు సన్నని మార్గంలో నిలబడివున్నాడు.

అప్పటికే ట్రైను వేగం పుంజుకుంది.

రాజారావు ఒక్కో అడుగు ముందుకేస్తూ నానీని చేరుతుంటే భయంతో వణికి పోతున్నాడు నానీ.

మరో అర క్షణంలో నానీ చేతిని బలంగా పట్టుకునేవాడే....

కాని అప్పటికే టి.టి.ఇ. నానీ వెనుగ్గా రావడంతో ఆగిపోయి కిటికిలోనుంచి బయటకు చూస్తూ వుండిపోయాడు రాజారావు.

అదే రాజారావు చేసిన చిన్న పొరపాటు.

ఆ కొద్దిపాటి అవకాశాన్ని జారవిడుచుకోకుండా ఓరగా తెరుచుకుని వున్న ఓ 'కూపే' ద్వారంలో నుంచి లోపలికి జొరబడిపోయాడు నానీ.

స్నేహితురాలు ఆశతో మాట్లాడుతున్న హరిత ఒక్క క్షణం విస్మయంగా చూసింది.

భయంతో బిక్కమొహం వేసుకు నిలబడ్డ నానీ ప్రస్తుత మానసిక స్థితేమిటో తెలుసుకోక పోయినా బహుశా టిక్కెట్టు లేకుండా ఏ టి.టి.ఇ. చేతనో తరమబడుతున్నాడనుకుంటూ ద్వారం మూసేసింది హరిత.

అదే తేరుకున్న రాజారావుని చేష్టలుడిగిపోయేట్టు చేసింది కూడా.

"ఏంటి మాష్టారూ.... ఆడవాళ్ళ కూపేలో మగాళ్ళు ఇలా పర్మిషను లేకుండా దూరిపోవచ్చా?" అంది హరిత నానీని చూస్తూ....

"మరేమో...." రాజారావు తరుముతున్నట్టు చెప్పాలనుకున్నాడు కాని అలా చెబితే ఆడవాళ్ళు కాబట్టి రాజారావుకి భయపడి అప్పచెప్పేస్తారేమో అని ఆందోళన పడిపోయాడు "చోటుంటుందని."

"ఎంత మాట.... ఉంటుంది.... కాని నువ్వు మగాడివిగా, పైగా వచ్చేది రాత్రి ప్రయాణం.... మాకు ప్రమాదం కదూ."

"ఎందుకూ?" అమాయకంగా అడిగాడు.

"నువ్వు మగాడివి కాబట్టి" అంటూ నవ్వేసిన హరిత "పోనీలే ప్రమాదకరమైన మగాడిలా లేవు" పక్కన కూర్చోబెట్టుకుంది....... "అవునూ.... ఆడపిల్లలా వణికి పోతున్నావేంటి?"

"నేను వణికి పోవడం లేదు" దీర్ఘం తీస్తున్నట్టుగా అన్నాడు.

"ఏం....?"

"నేను మగాడ్నిగా"

ఈసారి ఆశ ఫక్కున నవ్వేసింది "మొత్తానికి ఒప్పేసుకున్నావు."

"మా అమ్మకూడా అంటుండేది."

"ఏమని?" హరిత ఉత్సుకతగా అడిగింది.

"నేను మగపిల్లాడ్నీ అని"

"నాకు డౌటే..."

"ఒట్టు...."

"ఈసారి మీ అమ్మని అడిగెయ్.... 'నా మొహం చూస్తే పేంటేసుకున్న ఆడపిల్లలా వుంటావు అని ఆడపిల్లలన్నారని' సరేనా"

తల అడ్డంగా వూపాడు వీలుకాదన్నట్టుగా.

"ఏం.... అడగడానికి సిగ్గా?"

"కాదు."

"మరి?"

"అమ్మ లేదుగా!"

"ఏమైంది?"

"చచ్చిపోయింది, మూడ్రోజుల క్రిందటే."

హరిత అవాక్కయిపోయింది- "ఎక్కడి కెళుతున్నావు?"

"ఏడో స్టేషనుకి."

"వ్వాట్?" అర్థం కాలేదు హరితకి.

"అవునూ.... తాతయ్యకి బాగోలేదుగా.... అందుకు మందుకోసం పంపారు"

"మరి ఏడో స్టేషనేంటి?"

"అదంతే.... ట్రైనెక్కాక ఆరు స్టేషన్లలో ఆగేవరకు వూరుకుని ఏడో స్టేషనులో దిగితే ఓ గెడ్డం డాక్టరుంటాడట. ఆయన దగ్గరకెళ్ళి తాతయ్యకి మందంటే ఇస్తాడటా...." నానీ చెబుతుంటే విస్తుపోతూ వింది హరిత.

"ఏడో స్టేషనంటే అసలే ఊరు?"

"ఏమో లెక్క పెడుతుంటానుగా"

"అంతకంటే మీ తాతయ్యే నడగాల్సింది."

"ఎందుకూ.... నాకు లెక్కలు బాగానేవచ్చు. కరెక్టుగా దిగిపోతాను."

"కాఫీ తాగుతావా" ఫ్లాస్కు అందుకోబోతుంటే వద్దన్నట్లుగా తలూపాడు "మీ తాతయ్య తాగొద్దన్నాడా?"

"ఉహు.... నా కలవాటు లేదు" హరిత చనువుగా మాట్లాడుతుంటే క్రమంగా తేరుకుంటున్నాడు.

"అలవాటు కావాలంటే తాగాలిగా."

"మరి తాగితే అలవాటైపోతుందిగా."

"చెట్టు ముందా విత్తు ముందా? అన్నట్టుంది" అనేసింది హరిత నవ్వుతూ.

"చెట్టే ముందు" కిటికీలో నుంచి బయటకు చూస్తూనే అన్నాడు నానీ.

ఈ జవాబుకి హరితతో పాటు ఆశా ఉలిక్కిపడింది.

"చూడు మగబ్బాయ్... అసలు దానికి ఆన్సరే లేదు" అంది కరెక్టు చేద్దామని.

"మల్లెచెట్టు చూశారా ఆంటీ...." అడిగాడు. ఆమె విస్మయం నుంచి తేరుకోకముందే "ఆ చెట్టుకి విత్తనమే లేదుగా. అంచేత ప్రపంచంలో విత్తనం లేని చెట్లున్నాయి గాని చెట్లు లేకుండా విత్తనాల్లేవు..." గడగడా చెప్పేశాడు.

"అవును ఇదంతా నీకెవరు చెప్పారు."

"జబ్బు పడ్డాడన్నానే మా తాతయ్య"

"ఆయనకి నా జోహార్లు. ఎందుకంటే ఆలస్యంగానైనా ఈ ప్రపంచానికి ఇలాంటి మేధావైన మనవడ్ని తయారుచేసి పంపుతున్నందుకు. అవునూ నీకు లెక్కలు కూడా బాగా వచ్చన్నావుగా."

"ఓ...."

హరిత ఏదో అడగబోయింది.

కాని ఇంతలోనే లోపలికి వచ్చేశాడు టి.టి.యి.

వస్తూ నానీ వేపు చూసిన చూపులోనే గుర్తుపట్టేసింది. అప్పళంగా ఏదన్నా గుంజేద్దామన్న అతడి తాపత్రయాన్ని అర్థం చేసుకుని రెండు టిక్కెట్లు అందించింది.

చార్టు, టిక్కెట్లు చెక్‌చేసుకుని వెనక్కి ఇచ్చేస్తూ "ఈ అబ్బాయి"

"మా అబ్బాయే...."

కాదనబోయిన నానీకేసి కళ్ళెర్రజేసి చూసింది అంతే.... నానీ నోరు మూసేసుకున్నాడు.

"మీ అబ్బాయా...."

"నాకు నమ్మకం లేదు..."

చాలా అనుమానంగా చూస్తూ అన్నాడు టి.టి.యి.

"బోడి మీ

నమ్మకం ఎవరికి కావాలిగాని వాడు అచ్చు మా అబ్బాయేనండి."

“నమ్మలేకపోతున్నాను” అంత చిన్న వయసులో వున్న హారితకి అంత పెద్ద కొడుకుండటం టి.టి.యి. కి ఆశ్చర్యం కలిగిస్తే- “వెధవ మూడో ఏడు దాటకపోయినా మనిషి మాత్రం ఎనిమిదేళ్ల పిల్లాడిలా ఎదిగిపోయాడు” అంది టి.టి.యి. విస్మయాన్ని అవకాశంగా తీసుకుని.

“మీ అబ్బాయికి మూడో ఏడా” ఒత్తిపలికాడు మరింత నిశ్చేష్టుడైపోయి నానీని చూస్తూ.

“లేదు.... ఎనిమిది” టక్కున అనేశాడు నానీ.

పాయింటు పట్టేసినందుకు గర్వంగా టి.టి.యి. క్రీగంట చూడగానే కొంచెం సర్దుకుంది హారిత “అదేంటో వాడికి చిన్నతనం నుంచీ అయిదు నెంబరన్నా, పంచభూతాలన్నా, పంచమ వేదమన్నా మహా ఇష్టం సుమండీ. మా ఇంటి చుట్టుపక్కల
అయిదుగురు స్నేహితులున్నారు కూడా. అయిదుగురితో కలిసి బ్రతకరా అంటే వాడి వయసులో కూడా అయిదు కలిపేసి అందరికీ చెప్పేస్తుంటాడు. చిన్ని వేధవ” నానీని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది.

“నమ్మలేకపోతున్నానండీ.”

“మీ ఎత్తెంతండీ?”

“ఓ పదిరూపాయలు చాలండి” టక్కున జవాబిచ్చాడు.

“మాస్టారూ మీరెంత కొట్టేద్దామని ఎత్తు వేస్తున్నారు అని అడగడం లేదు నేను. మీ హైటెంత? అంటున్నాను.”

“ఓస్సదా” తొట్రుపడిపోయాడు. “నాలుగున్నరండి.”

“వాడ్ని మీ హైటెంతని అడగండి.... అయిదు కలిపి తొమ్మిదిన్నరంటాడు. అయిదంటే వాడికంత ఇష్టం.”

ఇహ లాభం లేదనుకున్నాడు టి.టి.యి. మంచిగా చెబితే డబ్బులు కక్కేట్టు లేరని ఆఫీషియల్‌గా హేండిల్ చేసేద్దామని “చూడు మేడమ్.... అబ్బాయి నా భుజాల హైటున్నాడు. మూడు సంవత్సరాలనడం నాకేం నచ్చడం లేదు” సీరియస్‌గా అన్నాడు.

“మీ ఏజెంతండి?” అడిగింది అణుకువగా.

“నలభయ్యండి.”